# 15

# పరిచయం (యూదా)

యూదా పత్రికకు 2 పేతురు పత్రికకు గమనించదగిన పోలికలు కలవు. వాస్తవానికి, యూదా పత్రిక మరియు 2 పేతురు పత్రిక ఒకొక్కసారి ఒకే రకమైన పదాలను మరియు వ్యక్తీకరణలను ఉపయోగించాయి. కాబట్టి యూదా పత్రికను 2 పేతురు పత్రికతో కలిపి చదువుట సరియైనది, సముచితమైనది. యూదా పత్రిక మరియు 2 పేతురు పత్రికలలోని విషయాలు మరియు ఆలోచనలు 1 పేతురు పత్రికలోని వాటితో భిన్నమైనవి. కాని అవి సంఘము యొక్క జీవమునకు మరియు యోగక్షేమమునకు ఏ మాత్రము తక్కువ ప్రాముఖ్యము నిచ్చినవికావు.

## గ్రంథకర్త

యూదా తననుతాను "యేసుక్రీస్తు దాసుడును, యాకోబు సహోదరుడునైన యూదా" (1 వచనం) అని పిలుచుకొనెను. తాను సూచించిన యాకోబును మనము గుర్తించగలిగితే, ఆ స్థాయికి మనము యూదాను గుర్తించగలము. తొలి సంఘములో ఉన్నతమైన పేరుగల మనిషి సందేహము లేకుండా ప్రభువు యొక్క సహోదరుడగు యాకోబు (అపొస్తలుల కార్యములు 15:13; 21:18; గలతీయులకు 1:19). ఈయనే యాకోబు పత్రికను వ్రాసినవాడు, మరియు పునరుత్థానము తరువాత క్రీస్తు ప్రత్యక్షమయిన వ్యక్తి (1 కొరింథీయులకు 15:7). యాకోబు ఎవరని యూదా ఎక్కువ వివరణను ఇవ్వలేదు. ఎందుకనగా, బహుశ ఎటువంటి వివరణ అవసరములేదు. తొలి సంఘములో యాకోబు మాత్రమే అటువంటి ఉన్నతమైనవాడు, కేవలం ఆయన పేరు మాత్రమే ప్రస్తావించిన చాలును. ఈ పత్రిక రచయితయై యుండుటకు అవకాశం కలిగిన మరొక వ్యక్తి జెబదయ కుమారుడైన యాకోబు, యూదా పత్రిక రాయుటకు చాలా సంవత్సరములకు ముందే చంపబడ్డాడు (అపొస్తలుల కార్యములు 12:1, 2).

ప్రభువు, యాకోబు, యోసేపు (లేదా జోసెస్), సీమోను మరియు యూదా (యూదాస్) అను పేర్లుగల సహోదరులను కలిగియుండెను అని చెప్పబడింది (మత్తయి 13:55; మార్కు 6:3). క్రీస్తు జీవిత కాలములో ఆయన సహోదరులు ఆయనను క్రీస్తుగా నమ్మియుండక, ఆయనను నిందించువారితో కలిసిపోయిరి (యోహాను 7:1-5). బహుశ యాకోబు మొదట విశ్వాసిగా మారియుండవచ్చు, మిగిలినవారికి ఆయనే బోధించియుండవచ్చు. పౌలు 1 కొరింథీ పత్రికను వ్రాసే సమయానికి ప్రభువు యొక్క సహోదరులు ప్రసిద్ధిచెందిన బోధకులు మరియు ప్రసంగికులుగా సుపరిచితులై ఉండిరి (1 కొరింథీయులకు 9:5). యూదా కానీ యాకోబు కానీ వారి పత్రికలోని తొలిపలుకులలో తమకు తాము క్రీస్తు సహోదరులుగా గుర్తించబడాలని అనుకొనలేదు. వారు క్రీస్తు దాసులుగా యుండుటకంటె మరే ఉన్నతమైన గౌరవమును ఆశించలేదు.

## పత్రిక వ్రాయుటకు గల సందర్భము

యూదా పత్రికలోని అబద్ధ బోధకుల వర్ణన 2 పేతురు పత్రికలోని వర్ణన పోలియుంది. పరిస్థితులు ఒకేలా ఉన్నందున యూదా పేతురు వాడిన పదాలను అరువు తీసుకున్నాడు. అట్లుండగా పేతురు భవిష్యత్ కాలములో హెచ్చరికలు చేస్తూండగా, "మీలోను అబద్ధ బోధకులుందురు, ..." (2 పేతురు 2:1), యూదా అబద్ధ బోధకులు సంఘములోనికి ప్రవేశించిరని భూత కాలములో సూచించెను. యూదా వారి ఒకే రక్షణను గూర్చి తన స్నేహితులకు నాణ్యమైనవి వ్రాయాలని ఆశించెను కానీ అబద్ధ బోధకులవలనైన భయము సంఘములోనికి వచ్చుట వలన వారి విశ్వాస విషయములో వారికి అప్పగింపబడిన బోధ నిమిత్తము పోరాడవలెనని వారికి వ్రాయవలసియు మరియు వేడుకొనవలసి వచ్చెను (యూదా 3).

యూదా పత్రిక అనేకమైన ప్రశ్నలను లేవనెత్తింది, వాటికి మనము సమాధానము చెప్పలేము, మరియు కొన్నింటికి కేవలము సబబైన అంచనాలు మాత్రమే చేయగలము. యూదా మరియు పేతురు యొక్క మాటలు ఒకదానికొకటి బలము చేకూర్చుకొనుచున్నాయని మనకు తెలుసు. సరైన సమాచారము అందుబాటులో లేనప్పుడు పేతురుచే సూచించబడిన ప్రాంతాలలో గల సంఘాలకే యూదా కూడా ఉద్దేశించి సూచించినట్టు మనము ఊహించవలసినవారమైయున్నాము. యూదా అనేక సంఘాలలో పలుకుబడి కలిగియుండెను. పేతురు మిగిలిన ప్రాంతాలలో పలుకుబడి కలిగియుండెను. యూదా చాలా తెలివిగా పేతురు ఉపయోగించిన పదాలను ఉపయోగించెను, తద్వారా తాను మరియు అపొస్తలులు కలిసికట్టుగా అబద్ధ బోధలతో సంఘాలను ఇబ్బంది పెట్టుచున్న అబద్ధ బోధకులకు వ్యతిరేకముగా నిలబడ్డారన్న విషయాన్ని స్పష్టం చేసాడు. 2 పేతురు పత్రికను వ్రాసిన కొన్ని సంవత్సారాల తరువాత బహుశ యూదా తన పత్రికను వ్రాసియుండవచ్చును. ఆ కాలము 60వ శతాబ్దము చివరిలో లేదా 70వ శతాబ్దము ప్రారంభములో అయి ఉండవచ్చును. ఈ పత్రిక, యూదా వ్రాసినప్పుడు ఎక్కడ ఉన్నాడని, లేదా ఈ పత్రిక చదువరులతో ఆయనకున్న సంబంధము యొక్క చరిత్రను గూర్చి ఎటువంటి సూచననివ్వలేదు.

---

## యూదా పత్రిక యొక్క సంక్షిప్త వర్ణన

**వందన వచనములు:** దేవునిచే ఎన్నిక చేయబడిన వారికి యూదా వ్రాయుట (1, 2 వచనాలు)

**I.** దేవుని తిరస్కరించువారిపై **ఆయన తీర్పు** (3–7 వచనాలు).

**II.** భక్తిహీనుల దురహంకారముపట్ల **దేవుని ఉగ్రత** (8–16 వచనాలు).

**III.** దేవుని ప్రజల కొరకు **ఆయన ప్రేమ** (17–23 వచనాలు).

**దైవస్తోత్రముతో ముగింపు** (24, 25 వచనాలు)